సాక్షి రంగారెడ్డి

గురువారం, 7, నవంబర్, 2024



పకడ్బందీగా కుటుంబ సర్వే

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సర్వేకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. 10లో▸



ఐడీ నంబర్లు ఇవ్వండి

నూతన ఉపాధ్యాయులకు ఐడీ నంబర్లు ఇవ్వాలని పీఆర్టీయూ సంఘం సభ్యులు వై.వెంకటయ్యను కోరారు. 10లో▸



పగలు రెక్కీ .. రాత్రి చోరీ

కొత్తగా వేసిన వెంచర్‌లలో ఫైర్లను మాయం చేస్తున్న ముఠాను పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. 10లో▸

న్యూస్‌రీల్

పదిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

డీటీడీఓ రామేశ్వరి దేవి



వసతిగృహాన్ని సందర్శించిన డీటీడీఓ రామేశ్వరి దేవి

కడ్తాల్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యమని జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి(డీటీడీఓ) రామేశ్వరి దేవి అన్నారు. బుధవారం ఆమె మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, బాలుర వసతి వసతిగృహాలను ఏటీడీఓ వెంకటయ్యతో కలిసి సందర్శించారు. వసతిగృహం, ఆశ్రమ పాఠశాల రికార్డులు, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టిక, వంట గది, పరిసరాలను పరిశీలించారు. వసతిగృహ సంక్షేమాధికారి రాములుతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం రామేశ్వరిదేవి మాట్లాడుతూ.. డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాలని, విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా బోధన చేయాలని సూచించారు. పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. భోజనంలో మెనూ పాటించాలని, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు.

డీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్‌గా పెంటయ్య



పెంటయ్యకు నియామకపత్రం అందజేస్తున్న ప్రీతం

అబ్దుల్లాపూర్‌మెట్: కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్‌గా పెద్దఅంబర్‌పేటకు చెందిన పంది పెంటయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీసెల్ రాష్ట్ర చైర్మన్ నగరిగారి ప్రీతం చేతుల మీదుగా బుధవారం పెంటయ్యకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో డీసీసీ ఎస్సీసెల్ చైర్మన్‌గా నియమించడం ఆనందంగా ఉందని.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రతీ దళితుడికి చేరేలా కృషి చేస్తానన్నారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగుల లెక్క తేల్చండి

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య



మాట్లాడుతున్న జంగయ్య

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలోని దివ్యాంగుల లెక్క తేల్చాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేపడుతున్న కులగణనలో దివ్యాంగుల సంఖ్యను సైతం తేల్చాలని ప్రభుత్వాన్ని కోరారు. జనాభా ప్రతిపాదికన బడ్జెట్ కేటాయించి ఉపాధి, ఉద్యోగ రంగాలల్లో ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. గ్రామానికి పది చొప్పున దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్ నాయక్, ప్రధాన కార్యదర్శి జి.యాదయ్య, ఎం.బాలరాజ్, ఎ.సంజీవ పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయే సర్వే

రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులను రద్దు చేయం

- అపోహలు నమ్మొద్దు
- పూర్తి సమాచారం ఇచ్చి సిబ్బందికి సహకరించాలి
- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభోత్సవంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, చిత్రంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే చరిత్రలో నిలిచిపోనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న ఆయన బుధవారం ఈ సర్వే కార్యక్రమాన్ని శంకర్‌పల్లి పట్టణంలోని 9వ వార్డులో స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సర్వేపై రాష్ట్రంలో ఇతర పార్టీల నాయకులు సృష్టించే వదంతులను ప్రజలు నమ్మొద్దని.. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ఇంటికి వచ్చే అధికారులకు పూర్తి సమాచారం ఇచ్చి సహకరించాలన్నారు. ఈ సర్వేలో సేకరించిన సమాచారంతో ప్రభుత్వ పథకాల్లో అర్హులకు న్యాయం చేయడమే తమ అంతిమ లక్ష్యమన్నారు. ఈ సర్వే దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొంత మంది నాయకులు రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు రద్దు చేస్తారని చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు వాటిని విశ్వసించొద్దన్నారు. ఈ కార్యక్రమాన్ని పోచమ్మ దేవాలయ ఆవరణలో ప్రారంభించడంతో, తల్లి ఆశీస్సులు, దీవెనలతో దిగ్విజయంగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

రెండు విడతలుగా సర్వే

ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమం బుధవారం నుంచి ఈ నెల 30 వరకు రెండు విడతలుగా కొనసాగుతుందని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ఈ సర్వేలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 5,344మంది ఎన్యుమరేటర్లు పనిచేస్తారని.. వారికి ఇప్పటికే రెండు సార్లు శిక్షణ ఇచ్చామన్నారు. జిల్లాలో 6.57లక్షల కుటుంబాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని, సర్వే పూర్తి అయ్యే లోపు ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మొదటి విడతలో మూడు రోజుల పాటు ప్రతీ ఇంటికి స్టిక్కర్ అంటించి, ఒక కోడ్ ఇస్తారని, రెండో విడతలో ఇంటికి ఎన్యుమరేటర్లు వచ్చి 56 అంశాలపై వివరాలు తెలుసుకుంటారని వివరించారు. ప్రతీ ఎన్యుమరేటర్ ఒక్కొక్క కుటుంబం దగ్గర 35 నుంచి 40 నిమిషాల సమయం కేటాయించి ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి సమాచారం సేకరించాలన్నారు. అనంతరం మంత్రి మున్సిపల్ పరిధిలోని సింగాపురంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూధన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీపీఓ సురేశ్‌మోహన్, ఆర్డీఓ చంద్రకళ, కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ సురేందర్, ఎంపీడీఓ వెంకయ్య, కౌన్సిలర్లు, నాయకులు ఉదయ్‌మోహన్ రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, షాబాద్ దర్శన్, మహేందర్ ముదిరాజ్, రాంరెడ్డి, కాశెట్టి మోహన్, ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఓ ఇంటికి సర్వే స్టిక్కర్ వేస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, చిత్రంలో మంత్రి, కలెక్టర్

దేశానికే ఆదర్శం: ఎమ్మెల్యే కాలె యాదయ్య

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ సర్వే దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని ధీమా వ్యక్తం చేశారు. గ్రామాలు, పట్టణాల్లోని ప్రజలంతా ఇంటి వద్దకు వచ్చే అధికారులకు సహకరించాలని కోరారు.

భవిష్యత్ అవసరాలకు ఉపయోగం: కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలోని సమాచారం భవిష్యత్‌లో సామాజిక, విద్యా, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుంది. పక్కా ప్రణాళికతో ఎన్యుమరేటర్లకి రెండు సార్లు శిక్షణ ఇచ్చాం. అధికారులు సర్వేలో తప్పులు దొర్లకుండా, ఒకటికి రెండు సార్లు సరి చూసుకోవాలన్నారు. ప్రతీ పది మంది ఎన్యుమరేటర్‌కి ఒక సూపర్‌వైజర్, మండలానికి, నియోజకవర్గానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ని నియమించినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వేలో ప్రతీ ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, రెండు విడతలను 15 రోజుల్లో పూర్తి చేసి, వివరాలను ఈనెల 30 వరకు కంప్యూటరీకరణ చేయాలని కోరారు.



హాజరు రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

హడలెత్తించిన కలెక్టర్

- శంకర్‌పల్లి పీహెచ్‌సీ, ఆదర్శ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ
- వైద్యురాలితో పాటుగా ఇద్దరు సిబ్బందికి మెమోలు, ఒకరి సస్పెండ్
- నెలరోజుల్లో తీరుమారాలని కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరిక

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి శంకర్‌పల్లి పట్టణంలో ఆకస్మికంగా పర్యటించారు. తహసీల్దార్, ఆదర్శ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు, రిజిస్ట్రేషన్ తదితర విషయాలను తహసీల్దార్ సురేందర్‌ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న ఆదర్శ పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా లేకపోవడం, తాగునీటి సరఫరా, బయట వ్యక్తులు లోపలికి వచ్చే అవకాశం ఉండడం తదితర విషయాలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డిజిటల్ విద్యాబోధనను మరింత మెరుగు పరుచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల గ్రంథాలయంలో సరైన పుస్తకాలు, మౌలిక సదుపాయాలు లేవని గుర్తించిన ఆయన వద్ద ఉన్న స్పెషల్ గ్రాంట్ నిధుల నుంచి గ్రంథాలయానికి రూ.లక్ష, పాఠశాల అభివృద్ధికి రూ.5లక్షలను మంజూరు చేశారు. పాఠశాలని సీఎస్ఆర్ ఫండ్ కింద మరింత అభివృద్ధి చేసుకోవాలని ఎంఈఓ అక్బర్‌కి సూచించారు.

సీనియర్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్

శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణ అపరిశుభ్రంగా ఉండడంతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదర్శ పాఠశాలతో పాటు ఆస్పత్రి ఆవరణను వెంటనే డోజర్లతో శుభ్రం చేయించాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తూ ఒక్కొక్కరి వివరాలు తెలుసుకున్నారు. సమాచారం లేకుండా సెలవు తీసుకున్న సీనియర్ అసిస్టెంట్ టోనీపై సస్పెన్షన్ వేటు వేసిన కలెక్టర్ విధులు సక్రమంగా నిర్వహించని కారణంగా ఎంసీహెచ్ సూపర్‌వైజర్ యాగ్నస్, సిబ్బంది శ్రీనివాస్‌తో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రేవతిరెడ్డికి మోమోలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. నెల రోజుల తర్వాత శంకర్‌పల్లికి వస్తానని, ఆదర్శ పాఠశాల, ఆసుపత్రి ఆవరణ తీరు మారిపోవాలన్నారు.

గురుకులాల నిర్వీర్యానికి కుట్ర



కోడింగ్ అకాడమీ విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

- ముఖ్యమంత్రికి తప్పుడు సమాచారం ఇస్తున్న గురుకుల విద్యా సంస్థ కార్యదర్శి
- బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

మొయినాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. బుధవారం ఆయన మొయినాబాద్ మండలం పెద్దమంగళారంలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల ఆధ్వర్యంలో కొనసాగుతున్న కోడింగ్ అకాడమీని సందర్శించారు. విద్యార్థులుతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కోడింగ్ అకాడమీలో కోడింగ్ నేర్పించే ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని అకాడమిక్ చదువు చెప్పే ఉపాధ్యాయులు లేరని.. దీంతో 10వ తరగతి విద్యార్థులు ఇక్కడి నుంచి వెళ్లిపోయారని.. 5వ తరగతిలో ప్రవేశాలు తీసుకోవడం నిలిపివేశారని విద్యార్థులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో తొలి కోడింగ్ అకాడమీని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే దాన్ని మూసివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందన్నారు. ప్రతి పేదవాడికి నాణ్యమైన విద్య అందించేలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం గురుకుల వ్యవస్థను బలోపేతం చేస్తే అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థ కార్యదర్శి విద్యార్థుల పట్ల వివక్ష చూపుతున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు చెబుతున్నారన్నారు. కోడింగ్ అకాడమీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గురుకుల విద్యా సంస్థ కార్యదర్శి తప్పుడు సమాచారం ఇస్తున్నారని.. అందుకు నిదర్శనం అధికారులు చెప్పే తప్పుడు లెక్క లేనన్నారు. ప్రస్తుతం కోడింగ్ అకాడమీలో 218 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని... కానీ అధికారులు మాత్రం 540 మంది విద్యార్థులు ఉన్నట్లు తప్పుడు లెక్కలు చెబుతున్నారన్నారు. కోడింగ్ అకాడమీలో సమస్యలు పరిష్కరించి యదావిధిగా కొనసాగించాలని.. గురుకుల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, అవినాష్, నాయకులు ఆంజనేయులు, జయవంత్, డప్పు రాజు, సంజీవరావు, పరమేష్, ప్రవీణ్, సత్తిరెడ్డి, నర్సింహారెడ్డి, సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.



పరిశ్రమలో ఎగిసి పడుతున్న మంటలు

క్యాంసన్ పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం

- పెద్ద ఎత్తున ఎగిసిపడిన మంటలు
- క్షణాల్లోనే నేలమట్టమైన పరిశ్రమ
- సుమారు రూ.30కోట్ల ఆస్తినష్టం

నందిగామ: రంగారెడ్డి జిల్లా నందిగామలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. నందిగామ శివారులోని 44వ జాతీయ రహదారి సమీపంలోని సత్వేంద్రిగూడ రోడ్డులో క్యాంసన్ హైజన్‌కేర్ పరిశ్రమ ఉంది. ఇక్కడ డైపర్లు తయారు చేస్తుంటారు. మంగళవారం రాత్రి షిఫ్టులో సుమారు 40 మంది కార్మికులు పనిచేస్తున్నారు. తెల్లవారు జామున 2 గంటల ప్రాంతంలో స్టోర్ రూంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా చిన్నగా మంటలు చెలరేగాయి. మంటలు తీవ్రమవుతుండడంతో గమనించిన కార్మికులు భయాందోళనతో బయటకు పరుగు తీశారు. మంటలను ఆర్పేందుకు యత్నించేలోగానే ఒక్కసారిగా పరిశ్రమ మొత్తం నల్లటి పొగతో దట్టమైన మంటలు చెలరేగాయి. దీంతో కార్మికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు.



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

మంటలార్పేందుకు నాలుగు ఫైర్ ఇంజిన్లు

సమాచారం అందిన వెంటనే డీఎఫ్ఓ మురళీ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో షాద్‌నగర్, రాజేంద్రనగర్, శంషాబాద్, మహేశ్వరం ఫైర్ స్టేషన్ల నుంచి నాలుగు ఫైర్ ఇంజిన్లు తెప్పించి మంటలు అదుపులోకి తెచ్చారు. అప్పటికే పరిశ్రమ మొత్తం కాలిబూడిదైంది. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడంతో పరిశ్రమ యాజమాన్యం, కార్మికులు ఊపిరి పీల్చుకున్నారు. యంత్రాలు, స్టాకు పూర్తిగా దగ్ధమై రూ.30కోట్ల ఆస్తినష్టం వాటిల్లిందని నిర్వాహకులు తెలిపారు.

మంటలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు

కాగా ఈ పరిశ్రమ ఆవరణలోని మరో షెడ్డుకు మంటలు వ్యాపించి ఉంటే ఆస్తినష్టం మరింత పెరిగేదని నిర్వాహకులు వాపోయారు. ఓ పక్క ఫైరింజన్లతో మంటలార్పుతూనే ఐదు జేసీబీల సాయంతో ఇనుప వ్యర్థాల తొలగింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఎస్ఐ గోపాల కృష్ణ చేరుకుని పరిశీలించారు. పరిశ్రమ హెచ్ఆర్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ముకునూర్‌లో ఎన్ఆర్ఎల్ఎం బృందం

పంచాయతీ కార్యదర్శిని అభినందించిన సభ్యులు

ఇబ్రహీంపట్నం: నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) బృందం సభ్యులు మండల పరిధిలోని ముకునూర్ గ్రామాన్ని సందర్శించి వివిధ పనులను పరిశీలించారు. ఆ బృందం సభ్యులు భక్తవత్సల పెరుమాలన్, సుందర ప్యాండన్ ముకునూర్ గ్రామ పల్లె ప్రకృతి వనాన్ని, గ్రామీణ క్రీడా ప్రాంగణాన్ని, కంపోస్టు యార్డు నిర్వహణ, పాంపడ్ పనులను పరిశీలించారు. ఉపాధి హామీ రిజిస్టర్స్ మెయింటనెన్స్ పరిశీలించి గ్రామ కార్యదర్శి రాజ్‌కుమార్‌ను అభినందించారు. ఆసరా ఫించన్లు వస్తున్నా యా? ఎంత వస్తుందని పలువురు ఫించన్‌దారులను బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. స్త్రీనిధి రుణం తీసుకొని కిరాణ షాపును పెట్టుకు ని జీవనోపాధి పొందుతున్న మహిళతో వారు మాట్లాడారు. ఎంత అదాయం వస్తుంది? తీసుకున్న రుణం చెల్లించే విధానం అడిగారు. నిత్యం రూ.2వేల వ్యాపారం సాగుతుందని, వాయిదాల పద్దతిలో రుణాన్ని చెల్లిస్తుననట్లు ఆమె చెప్పారు. ఎంపీడీఓ వెంకటమ్మ, ఎంపీఓ లక్పతినాయక్, ఏపీఓ తిరుపతిచారి, ఏపీఎం రవీందర్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.



ఉపాధిహామీ రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఎన్ఆర్ఎల్ఎం సభ్యుల బృందం

సందడిగా తిరిగి.. నీళ్లబకెట్‌లో పడి..

విగతజీవిగా మారిన చిన్నారి

ఖైరతాబాద్: రాత్రి 9 గంటలు.. ఇంట్లో కుటుంబ సభ్యులంతా కలిసి భోజనం చేస్తున్నారు. ఏడాదిన్నర పాప తప్పటడుగులు వేస్తూ తిరుగుతుండగా తల్లి గోరుముద్దలు పెడుతోంది. చిన్నారి సందడికి అందరూ సంతోషంగా ఉన్నారు. అంతలోనే ఆ పాప బెడ్‌రూం బాత్‌రూంలోని నీళ్లబకెట్‌లో పడి విగతజీవిగా మారింది. ఖైరతాబాద్ ఏఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం... ఖైరతాబాద్ డివిజన్‌లోని ఐమాక్స్ ఎదురుగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లలో బి బ్లాక్ 307 ఫ్లాట్‌లో తోట సతీష్‌కుమార్, రేణుక దంపతులు నివసిస్తున్నారు. ఈ ఫ్లాట్‌లో మొత్తం 12 మంది ఉంటున్నారు. సతీష్ గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వారికి ముగ్గురు సంతానం. ఏడాదిన్నర వయసున్న మూడో కూతురు ఆద్విక మంగళవారంరాత్రి ఇంట్లో తల్లి పెట్టే గోరు ముద్దలు తింటూ సందడి చేస్తూ, తప్పటడుగులు వేస్తూ, అటు ఇటు తిరుగుతోంది. ఈ క్రమంలో తల్లి కూడా భోజనం ముగించుకొని 9.30 గంటలకు బెడ్‌రూంలో ఉన్న మొబైల్ ఫోన్ తీసుకునేందుకు వెళ్లగా అటాచ్‌డ్ బాత్‌రూం తలుపు తెరిచి ఉంది. అందులో ఉన్న నీళ్లబకెట్‌లో పాప కాళ్లు పైకి కనిపించడంతో తల్లి లబోదిబోమంటూ ఏడుస్తూ బయటికి తీసింది. కుటుంబసభ్యులు వెంటనే సమీపంలోని వాసవి హాస్పిటల్‌కు పాపను తీసుకువెళ్లారు. అక్కడ వైద్యుల సూచన మేరకు రాత్రి 11 గంటల నిలోఫర్ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ 11.40 గంటలకు చిన్నారి చనిపోయింది. కళ్ల ముందు ఆడుకుంటూ ఉన్న పాప అంతలోనే మృత్యువాత పడటంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.



ఆద్విక(ఫైల్)

పగలు రెక్కీ .. రాత్రి చోరీ

- కొత్త వెంచర్‌లు లక్ష్యంగా అల్యూమినియం వైర్ల అపహరణ
- దొంగల ముఠాను పట్టుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్‌రూరల్‌: కొత్తగా వేసిన వెంచర్‌లను లక్ష్యంగా చేసుకొని వైర్లను మాయం చేస్తున్న ముఠాను పోలీసులు కటకటాల పాలు చేశారు. ఈ మేరకు బుధవారం షాద్‌నగర్‌ పట్టణ సీఐ విజయ్‌కుమార్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రంగస్వామి వివరాలను వెల్లడించారు. శంషాబాద్‌ మండలం పాలమాకుల గ్రామానికి చెందిన కట్ట శ్రీనివాస్‌, దిల్‌వార్‌, పెద్ద తుప్పర గ్రామానికి చెందిన కకునూరి శ్రీకాంత్‌, మహేశ్వరం మండలం పెద్దమ్మతండా పరిధిలోని నల్లచెరువు తండాకు చెందిన బానోతురాజు ముఠాగా ఏర్పడ్డారు. వారు జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న వెంచర్‌లనే లక్ష్యంగా చేసుకొని అర్ధరాత్రి చోరీలకు పాల్పడుతున్నారు. పగటిపూట కకునూరి శ్రీకాంత్‌, బానోతురాజు బైక్‌పై రెక్కీ నిర్వహిస్తారు. అర్ధరాత్రి ముఠా సభ్యులు వెంచర్‌లలో చోరీ చేస్తారు. వెంచర్‌లలో విద్యుత్‌ స్తంభాలకు ఏర్పాటు చేసిన అల్యూమినియం వైర్లు, పాత ఇనుప సామగ్రిని అపహరించుకెళ్లి అమ్ముకొని కాసులు దండుకుంటున్నారు. పలు వెంచర్‌లలో వైర్లు మాయమైన విషయంపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా నిందితులు నేరాన్ని అంగీకరించారు. వారి నుంచి రూ.12.50 లక్షల నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లు, రెండు మినీ ట్రక్కు, ఒక బైకును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను ఏసీపీ రంగస్వామి అభినందించారు. సమావేశంలో శంషాబద్‌ సీసీఎస్‌ సీఐ పవన్‌, ఎస్‌ఐ భూపాల్‌, షాద్‌నగర్‌ డీఐ వెంకటేశ్వర్లు, డీఎస్‌ఐ శరత్‌కుమార్‌, కానిస్టేబుళ్లు మోహన్‌, కరుణాకర్‌, జాకీర్‌, రాజు, రఫీ, వెంకట్‌ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కుటుంబ సర్వే

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- అధికారులకు సహకరించాలని సూచన


మంచాల: ఆరుట్లలో సర్వే ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

మంచాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల సర్వేకు ప్రజలందరూ సహకరించాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఆరుట్లలో నిర్వహించిన సర్వే ప్రారంభోత్సవ సభకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించాలనే లక్ష్యంతోనే సర్వే చేయిస్తుందన్నారు. అధికార యంత్రాంగం చేసే సర్వేకు ప్రజలు పూర్తి సహకారం అందించాలన్నారు. కులగణనతో బడుగు బలహీన వర్గాలకు అభివృద్ధి ఫలాలు మరింత చేరువవుతాయన్నారు.

దళారులకు విక్రయించొద్దు

మండలంలోని లోయపల్లి, బోడకొండ, మంచాల గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే రంగారెడ్డి ప్రారంభించారు. గ్రామాల్లో ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు. ఏ గ్రేడ్‌ ధాన్యం క్వింటాల్‌కు రూ.2,320, బీ గ్రేడ్‌ రూ.2,300గా చెల్లిస్తుందన్నారు. సన్న రకాలకు రూ.500 బోనస్‌ కూడా అందిస్తుందన్నారు. రైతులు పండించిన ధాన్యం నేరుగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నారు.

భక్తులకు ఇబ్బందులు రానివొద్దు

ఆరుట్లలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధికారులకు సూచించారు. మండల కార్యాలయంలో జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో జరిగిన ఇబ్బందుల తిరిగి పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే భక్తులకు పార్కింగ్‌ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ చిలుక మధుసూదన్‌రెడ్డి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్‌ కొత్తకుర్మ సత్తయ్య, పీఏసీఎస్‌ చైర్మన్‌ హన్మంత్‌రెడ్డి, తహసీల్దార్‌ వెంకటప్రసాద్‌, ఎంపీడీఓ బాలశంకర్‌, ఎంపీఓ ఉమారాణి, ఏపీఎం శోభ, వైద్యురాలు ప్రియాంక, నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్‌, గురునాథ్‌రెడ్డి, మహిపాల్‌, విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్‌, నరేందర్‌రెడ్డి, వాజీద్‌, యాదయ్య, రాములు, వెంకటేశ్‌, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.


షాబాద్‌: పోతుగల్‌లో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి


కొత్తూరు: సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

పొరపాట్లు చేయొద్దు

షాబాద్‌: ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం మండల పరిధిలోని పోతుగల్‌ గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు సేకరించాలని తెలిపారు. శిక్షణలో సూచించిన అంశాలను జాగ్రత్తగా గుర్తు పెట్టుకొని, పొరపాట్లకు తావివ్వకుండా సర్వే నిర్వహించాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ అపర్ణ, ఎంపీఓ శ్రీనివాస్‌, పంచాయతీ కార్యదర్శి అశోక్‌, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతరాలు లేని సమాజమే లక్ష్యం

కొత్తూరు: అంతరాలు లేని సమాజ స్థాపనే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను ఆయన బుధవారం మండల పరిధిలోని తీగాపూర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణనతో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. సర్వేతో ప్రతి కులానికి జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో రిజర్వేషన్లు, ప్రాధాన్యత కల్పించడానికి అవకాశం ఉంటుందన్నారు. గత ప్రభుత్వాలు సర్వే చేపట్టని కారణంగా రాష్ట్రంలో అత్యల్పంగా ఉన్న కొన్ని కులాలకు చెందిన వారు మాత్రమే అన్ని రంగాల్లో ముందున్నారని ఆరోపించారు. సమగ్ర కుటుంబ సర్వే అనంతరం ప్రతి ఒక్కరి వివరాలు ప్రభుత్వం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. దీని ప్రకారం ప్రభుత్వం అమలు చేసే పథకాలు కేవలం అర్హులకు మాత్రమే దక్కుతాయన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రమాదేవి, ఎంపీడీఓ అరుంధతి, తహసీల్దార్‌ రవీందర్‌రెడ్డి, ఎంఈఓ అంగోర్‌నాయక్‌, నాయకులు సుదర్శన్‌గౌడ్‌, హరినాథ్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్‌, నర్సింహ, కృష్ణ, ప్రభాకర్‌, రఘు, చిర్ర మల్లయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యం

తల, మొండెం వేర్వేరుగా పడి ఉన్న వైనం

మొయినాబాద్‌: పూర్తిగా కుళ్లినస్థితిలో ఓ గుర్తు తెలియని మృతదేహం మొయినాబాద్‌లోని ముస్తాఫాహిల్‌ కాలనీ పరిసరాల్లో లభ్యమైంది. మొయినాబాద్‌ ఇన్‌స్పెక్టర్‌ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం ముస్తాఫాహిల్స్‌ కాలనీ సమీపంలో అటుగా వెళ్లిన కాలనీవాసులకు పూర్తిగా కుళ్లిపోయిన వ్యక్తి(40) మృతదేహం కనిపించింది. తల, మొండెం వేర్వేరుగా ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి, నల్లగా మారి ఉంది. సుమారు ఇరవై రోజుల క్రితం మరణించి ఉండవచ్చని.. కుక్కలు పీక్కుతినడంతో తల, మొండెం వేర్వేరుగా అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

- బైక్‌ అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టిన వైనం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

మొయినాబాద్‌: అర్ధరాత్రి వేళ బైక్‌ అదుపుతప్పి డివైడర్‌ మధ్యలో ఉన్న ఇనుప స్తంభాన్ని ఢీకొట్టడంతో ఓ విద్యార్థి మృతి చెందాడు. మరో ఇద్దరు గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఈ విషాద సంఘటన హైదరాబాద్‌–బీజాపూర్‌ జాతీయ రహదారిపై మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌ చౌరస్తా సమీపంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌ జిల్లా రామడుగు మండలం పత్తికుంట గ్రామానికి చెందిన మంద వంశీ(21) మొయినాబాద్‌లో అద్దెకు ఉంటూ జేబీఐటీ ఇంజనీరింగ్‌ కళాశాలలో బీటెక్‌ మూడో సంవత్సరం చదువుతున్నాడు. కాగా మంగళవారం అర్ధరాత్రి వంశీ, అతని స్నేహితులు శ్రీకర్‌, మధు ముగ్గురు కలిసి భోజనం చేయడానికి బైక్‌పై అజీజ్‌నగర్‌ చౌరస్తా వైపు వెళ్తున్నారు. హిమాయత్‌నగర్‌ చౌరస్తా సమీపంలోని ఇండియన్‌ పెట్రోల్‌ బంక్‌ వద్దకు రాగానే బైక్‌ అదుపుతప్పి జాతీయ రహదారి డివైడర్‌ మధ్యలో ఉన్న ఇనుప స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వంశీ మృతి చెందాడు. గాయాలైన శ్రీకర్‌, మధు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వీరేశ్‌



ఇబ్రహీంపట్నం రూరల్‌: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బోసుపల్లి వీరేశ్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర చైర్మన్‌ చీమ శ్రీనివాస్‌ నియామకపత్రం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వీరేశ్‌కుమార్‌ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్‌ ప్రభుత్వం హయాంలో సరైన న్యాయం చేయాలని కోరారు. నామినేటెడ్‌ పోస్టుల్లో తప్పకుండా ఉద్యమకారులకు పదవులు కట్టబెట్టాలని విజ్ఞప్తి చేశారు.

శిల్పా లేఔట్‌ భూముల క్రమబద్ధీకరణపై స్టేటస్‌కో

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్‌: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలిలో శిల్పా లేఔట్‌ భూముల క్రమబద్ధీకరణపై హైకోర్టు స్టేటస్‌కో విధించింది. సర్వే నంబర్‌ 32 నుంచి 40లో ఉన్న దాదాపు 99,013 చదరపు గజాల స్థలం విషయంలో యథాతథస్థితిని కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శిల్పా లేఔట్‌గా పిలిచే స్థలాన్ని ఫినిక్స్‌ ఇన్ఫోసిటీ, శిల్ప పయనీర్‌కు క్రమబద్ధీకరించే యత్నాలకు బ్రేక్‌ పడింది. ఈ 99,013 గజాలను నిషేధిత జాబితా నుంచి తొలగించాలంటూ కలెక్టర్‌కు రెవెన్యూ ముఖ్య కార్యదర్శి 2023 జూలైలో జారీ చేసిన మోమోను సవాల్‌ చేస్తూ సయ్యద్‌ ఖాజాం హుస్సేన్‌తో పాటు మరో 144 మంది హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్‌ సీవీ భాస్కర్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. 2008లోని జీవో 166, 2014లోని జీవో 58, 59ల కింద ఈ స్థలంలో ఉంటున్న పేదలు స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారని పిటిషనర్ల తరపు న్యాయవాది జెల్లి కనకయ్య వాదనలు వినిపించారు. గుడిసెలు వేసుకుని ఉంటున్న ఈ పేదలంతా క్రమబద్ధీకరణకు అర్హులన్నారు. వీరిని అక్కడి నుంచి పంపి ఫినిక్స్‌, శిల్పా పయనీర్‌కు అధికారులు అప్పగించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై కౌంటర్‌ దాఖలు చేసేందుకు మరో వాయిదా కావాలని కోరడంతో.. తదుపరి విచారణను న్యాయమూర్తి వచ్చే నెల 4కు వాయిదా వేశారు.

సీఎం ఇంటికి 'సర్వే' స్టిక్కర్‌

బంజారాహిల్స్‌: ముఖ్యమంత్రి ఇంటికి సర్వే స్టిక్కర్‌ పడింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం ఎన్యూమరేటర్లు జూబ్లీహిల్స్‌ రోడ్డు నెంబర్‌–44లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద ఇంటి నెంబర్‌, కుటుంబ యజమాని పేరు తదితర వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజరీ ఆఫీసర్‌ శివ, ఎన్యూమరేటర్‌ మంజుల, ఏఎంసీ అర్షద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఐడీ నంబర్లు ఇవ్వండి


జిల్లా పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ వెంకయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్‌: జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌ వై.వెంకయ్యను పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు బుధవారం కలిశారు. డీఎస్సీ 2024 నూతన ఉపాధ్యాయులకు ఉద్యోగ ఐడీ నంబర్లు త్వరలోనే ఇవ్వాలని పీఆర్‌టీయూ రంగారెడ్డి పక్షాన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్‌, ఇబ్రహీంపట్నం అధ్యక్షుడు డాక్టర్‌ పరమేష్‌, సుధాకర్‌, ఆనంద్‌కుమార్‌, లాలునాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

35 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం పట్టివేత

షాబాద్‌: ముందస్తు సమాచారంతో షాబాద్‌ పోలీసులు బ్లాక్‌లో అమ్ముతున్న 35 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని పట్టుకున్నారు. ఈ సంఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. మండలంలోని సర్దార్‌నగర్‌ గ్రామ పరిధిలో పీడీఎస్‌ రేషన్‌బియ్యం అమ్ముతున్నారని సమాచారం రావటంతో షాబాద్‌ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పీడీఎస్‌ బియ్యం కొంటున్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 35 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు వారిపై పోలీసులు కేసు నమోదు చేసి పోలీస్టేషన్‌కు తరలించారు.

'చెక్‌మేట్‌' కేసులో ఇద్దరి అరెస్టు

బంజారాహిల్స్‌: మెడికల్‌, ఇంజినీరింగ్‌ సీట్ల పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేసి మోసం చేసిన చెక్‌మేట్‌ సంస్థ ప్రతినిధులు ఆర్‌. భవానీశంకర్‌, అచ్యుత్‌ సాయిరాం చౌదరిలను జూబ్లీహిల్స్‌ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీనగర్‌కాలనీలో రోహిత్‌ అనే వ్యక్తి చెక్‌మేట్‌ సంస్థను ఏర్పాటు చేసి మెడికల్‌, ఇంజినీరింగ్‌ సీట్లు ఇప్పిస్తానంటూ వందలాది మంది నుంచి కోట్లు వసూలు చేసి సీట్లు మాత్రం ఇప్పించలేదు. దీంతో బాధితులు జూబ్లీహిల్స్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆలయాభివృద్ధికి నూతన కమిటీ అవసరం


మాట్లాడుతున్న బీచ్యానాయక్‌, నాయకులు

కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్‌

కడ్తాల్‌: మండల పరిధిలోని మైసిగండి ఆలయాభివృద్ధికి కమిటీ ఏర్పాటు చేసి మండల ప్రజలను భాగస్వాములను చేయాలని కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్‌, భక్తులు డిమాండ్‌ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 20 ఏళ్ల క్రితం వేసిన కమిటీ పదవీకాలం పూర్తయినా నేటికీ నూతన కమిటీ ఏర్పాటు చేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే ఆలయాభివృద్ధికి కమిటీ ఏర్పాటు చేసి గ్రామస్తులతో పాటుగా మండల ప్రజలకు చోటు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్‌లు చేగూరి వెంకటేశ్‌, శ్రీనివాస్‌, సేవాలాల్‌ సేన జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్‌, నాయకులు యాదయ్య, సత్యంయాదవ్‌, దాస్‌, శ్రీకాంత్‌, జనార్దన్‌గౌడ్‌, పారేశ్‌, జహంగీర్‌, రాజేందర్‌గౌడ్‌, రమేశ్‌, జంగయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

'మెడికవర్‌'లో చికిత్స పొందుతూ జూనియర్‌ డాక్టర్‌ మృతి

మాదాపూర్‌: మాదాపూర్‌లోని మెడికవర్‌ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ జూనియర్‌ డాక్టర్‌ మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. శంకర్‌ పల్లికి చెందిన జూనియర్‌ డాక్టర్‌ నాగప్రియ (28) అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆమె కుటుంబసభ్యులు ఈనెల 4న మాదాపూర్‌లోని మెడికవర్‌ ఆస్పత్రిలో చేర్పించారు. రెండు రోజుల పాటు వైద్యం అందించిన డాక్టర్లు రూ.3 లక్షలకు పైగా వసూలు చేశారు. ఇంకా డబ్బులు కట్టాలని లేని పక్షంలో వైద్య సేవలు నిలిపివేస్తామని చెప్పడంతో తాము రూ. లక్ష చెల్లించామన్నారు. అయితే ఆ తర్వాత కొద్ది సేపటికే నాగప్రియ మృతి చెందినట్లు చెప్పారన్నారు. అంతేగాక రూ.4 లక్షలు చెల్లిస్తేనే మృతదేహాన్ని అప్పగిస్తామని ఆసుపత్రి యాజమాన్యం చెప్పడంతో మృతురాలి బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు.

బిల్లు కోసం వేధించలేదు : డాక్టర్‌ లక్ష్మీకాంత్‌ రెడ్డి

అత్యవసర పరిస్థితిలో రోగిని మెడికవర్‌ ఆసుపత్రికి తీసుకువచ్చారు. రూ. 5,40,000 బిల్లు కాగా అందులో రూ. 3,10,000 చెల్లించారు. చివరగా ఫార్మసీ, ఇన్వెస్టిగేషన్స్‌కి సంబంధించి రూ. 48,000 చెల్లించాలని కోరగా, రూ.30 వేలు మాత్రమే చెల్లించారు.

అదనపు ఎస్పీల 'ఉచిత సేవ'!

- ఈ ఏడాది జూలైలో 14 మంది డీఎస్పీలకు పదోన్నతి
- అప్పటి నుంచి పని చేస్తున్నది ఎటాచ్‌మెంట్‌పై ఇప్పటి వరకు జీతాలు చెల్లించని ప్రభుత్వం
- బదిలీలకు సంబంధించి కొనసాగుతున్న కసరత్తు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర పోలీసు విభాగంలో పని చేస్తున్న కొందరు అదనపు ఎస్పీలు కొన్నాళ్లుగా ఉచిత సేవ చేస్తున్నారు. డీఎస్పీ నుంచి పదోన్నతి పొందిన తర్వాత వీరిని ఎటాచ్‌మెంట్‌ విధానంలో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మూడు నెలలుగా జీతాలు చెల్లించే పరిస్థితి లేకుండా పోయింది. ఐపీఎస్‌ల నుంచి డీఎస్పీల వరకు బదిలీలకు సంబంధించిన కసరత్తును పోలీసు విభాగం, ప్రభుత్వం కొనసాగిస్తుండటంతో తమకు జీతాలు ఎప్పుడు వస్తాయో చెప్పలేని స్థితిలో ఈ అధికారులు ఉన్నారు.

ఎక్కడి వారు అక్కడే పని చేసేలా...

ఈ ఏడాది జూలైలో 14 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో శాంతిభద్రతలు, నిఘా, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), క్రైమ్‌ ఇన్వెస్టిగేషన్‌ డిపార్ట్‌మెంట్‌ (సీఐడీ) తదితర విభాగాల్లో పని చేస్తున్న వాళ్లు ఉన్నారు. సాధారణంగా ఇలా ప్రమోషన్‌ వచ్చిన వెంటనే ఆయా అధికారుల్ని బదిలీ చేస్తారు. అప్పటి వరకు వీరు నిర్వర్తిస్తున్న పోస్టు నుంచి అదనపు ఎస్పీ స్థాయి దానికి మారుస్తారు. అయితే వీరికి పదోన్నతి ఇచ్చిన సర్కారు... ఎక్కడి వారు అక్కడే ఎటాచ్‌మెంట్‌పై పని చేసే విధంగా ఉత్తర్వులు ఇచ్చింది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో సర్దుబాట్ల కోసం కొన్ని రోజుల పాటు ఇలా ఎటాచ్‌మెంట్‌పై పని చేయించి.. ఆపై మరోచోట పోస్టింగ్‌ ఇస్తుంటారు.

మూడు నెలలుగా జీతాలు రాక...

తమకు కూడా అలానే వారం పది రోజుల్లో అదనపు ఎస్పీ స్థానాల్లో పోస్టింగ్‌ వస్తుందని ఈ అధికారులు భావించారు. పోలీసు విభాగంలో జీతాల చెల్లింపు అనేది అధికారులను బట్టి ఉండదు. వివిధ విభాగాల్లో ఉన్న పోస్టులకే పే అండ్‌ అకౌంట్స్‌ (పీఏఓ) కార్యాలయం జీతం కేటాయిస్తుంది. ఈ నేపథ్యంలో ఏ పోస్టింగ్‌ లేకుండా వెయిటింగ్‌లో, వెకెన్సీ రిజర్వ్‌లో (వీఆర్‌) ఉన్నప్పుడు, ఇలా ఎటాచ్‌మెంట్‌పై పని చేస్తున్నప్పుడు వారికి జీతాల కేటాయింపు జరగదు. పీఏఓ దృష్టిలో అప్పటి వరకు వీరు పని చేసిన డీఎస్పీ పోస్టు పదోన్నతితో ఖాళీ అయినట్లే లెక్క. అక్కడకు కొత్తగా రావాల్సిన అధికారి వస్తేనే మళ్లీ జీతం బిల్లు పాస్‌ అవుతుంది. వీరిని మరోచోట అదనపు ఎస్పీ పోస్టులో నియమిస్తేనే ఆ జీతం క్లెయిమ్‌ చేయగలరు. దీని ప్రకారం పదోన్నతి పొంది డీఎస్పీ పోస్టులోనే ఎటాచ్‌మెంట్‌పై పని చేస్తున్న అదనపు ఎస్పీలకు ఈ రెండు పోస్టుల్లో ఏదీ పీఏఓ దృష్టిలో అధికారికం కానట్లే లెక్క.

సిబిల్‌ కాపాడుకోవడానికి ఎన్నో తిప్పలు

పోలీసు అధికారుల్లో అంతా 'రెండు చేతులా' సంపాదించుకున్న వాళ్లో, స్థితిమంతులో ఉండరు. ఇలా వరుసగా మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఈ 14 మంది అధికారుల్లో కొందరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇల్లు, కారు, ఇతర ఉపకరణాల్లో ఏదో ఒకదానికి సంబంధించిన నెల వారీ కిస్తీలు (ఈఎంఐ), క్రెడిట్‌ కార్డు బిల్లులు చెల్లించడం ప్రస్తుతం అత్యధికులకు అనివార్యంగా మారింది. కొందరికి అన్ని రకాలైన ఈఎంఐలు ఉంటున్నాయి. దీంతో వాటికి సంబంధించి జారీ చేసిన చెక్కులు బౌన్స్‌ కాకుండా, సిబిల్‌ స్కోరు దెబ్బతినకుండా చూసుకోవడానికి అప్పులు చేసి బ్యాంకు ఖాతాల్లో వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ అధికారులకు పోస్టింగ్‌ వస్తే తప్ప జీతం బకాయిలు క్లైమ్‌ చేసుకోవడానికి ఆస్కారం ఉండదు. మూడు నెలలుగా పోలీసుల బదిలీలకు సంబంధించిన కసరత్తు నడుస్తున్నా ఇప్పటికీ ఓ కొలిక్కిరాలేదు. దీంతో ఇది ఎప్పటికి పూర్తవుతుందో, తమకు పోస్టింగ్‌తో పాటు జీతం ఎప్పుడు వస్తుందో అని అదనపు ఎస్పీలు ఆశగా ఎదురుచూస్తున్నారు.